RNI NO: APTEL/26/A5325
www.mahinewsindia.com
# మహి న్యూస్
MAHI NEWS
Epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 83 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య. పేజీలు : 4 వెల రూ. 2 గురువారం - 10 - సెప్టెంబర్ - 2026
Published From : Chittoor circulated by Kurnool I Anatapuram I YSR Kadapa I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



బంగ్లాదేశ్‌లో హిందువులపై మళ్లీ అఘాయిత్యాలు..
## ఇద్దరి దారుణ హత్య

బంగ్లాదేశ్‌లో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు హిందువులు హత్య
నౌగావ్‌లో స్వర్ణకారుడు అలీఫ్ చంద్ర దత్తాపై దుండగుల దాడి
దత్తా వద్ద నుంచి బంగారం, నగదు దోపిడీ
కాక్స్‌బజార్‌లో రాణి సుశీల్‌ను ఇంట్లోనే కత్తితో పొడిచిన దుండగుడు
దొంగతనానికి వచ్చిన వ్యక్తే దాడి చేసినట్లు పోలీసుల నిర్ధారణ

2లో

## ఇరాన్‌కు అణ్వాయుధం దక్కే ఛాన్సే లేదు: ట్రంప్



ఆ దేశాన్ని ఇప్పటికే తీవ్రంగా శిక్షించామని వ్యాఖ్య
9/11 దాడుల 25వ వార్షికోత్సవ సభలో కీలక వ్యాఖ్యలు
9/11 హీరో వెల్లెస్ క్రౌథర్‌కు మరణానంతరం అత్యున్నత పౌర పురస్కారం

2లో



2లో

## ఏపీ పర్యాటకానికి కొత్త జోష్.. 10 ప్రాంతాల్లో సీ ప్లేన్ల సందడి!

- స్కైహోప్ ఏవియేషన్, మెహెయిర్ సంస్థలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఒక్కో వాటర్‌డ్రోమ్ నిర్మాణానికి రూ. 20 కోట్ల వ్యయం అంచనా
- ఉడాన్ పథకం కింద ఆపరేటర్లకు కేంద్రం ఆర్థిక చేయూత
- మొదటి దశలో విజయవాడ, విశాఖ, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో సేవలు

## ఎన్నారైల అండతోనే గెలిచాం.. చంద్రబాబు అరెస్ట్ సమయంలో కొండంత బలమిచ్చారు: నారా లోకేశ్



2లో

- ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో ఎన్నారైల కృషి మరువలేనిదని కొనియాడిన మంత్రి లోకేశ్
- తెలుగుజాతిని ప్రపంచంలో నెం.1గా నిలిపే బాధ్యతను సమిష్టిగా తీసుకుందామని పిలుపు
- చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నిరసనలకు పిలుపు
- 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టీకరణ

## పోలవరాన్ని గోదాట్లో కలిపారు..
# మెగా డీఎస్సీకి అడ్డుపడ్డారు

### గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర విభజన కన్నా ఎక్కువ నష్టం జరిగింది

- ★ రాజకీయ కక్షతో పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు
- ★ హింసను ప్రేరేపిస్తూ గొడ్డలి పార్టీ కుట్రలకు పాల్పడుతోంది
- ★ మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు వందల కేసులు వేశారు
- ★ ప్రజల మద్దతుతోనే పోలవరం, అమరావతి నిర్మాణం సాధ్యమవుతోందని ఉద్ఘాటన



అమరావతి: కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తుంటే, 'గొడ్డలి పార్టీ' కుట్రలు పన్నుతోందని, జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం మాచవరంలో 'మీ భూమి- మీ హక్కు' సభలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర విభజన నష్టాలు, గత ప్రభుత్వ తీరు, మిగతా 2 లో



2లో

## తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు.. బుక్‌లెట్ విడుదల

శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు
సెప్టెంబర్‌లో సాలకట్ల, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు
ఉత్సవాల షెడ్యూల్‌తో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ
తిరుమల అన్నమయ్య భవనంలో విడుదల చేసిన ఛైర్మన్ బీఆర్ నాయుడు

## స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి

### సర్ ప్రక్రియలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని వెల్లడి

- అధికార దుర్వినియోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ శ్రేణులు నిలబడాలని పిలుపు
- స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా



అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఒక 'కురుక్షేత్ర సంగ్రామం' లాంటివని వైసీపీ అధినేత జగన్ అన్నారు. అధికార దుర్వినియోగం, మిగతా 2 లో

## గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

### గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ

- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. మిగతా 2 లో

# అది ఫాంహౌస్ భావజాలం.. సభ్యులతో అమలు చేయిస్తున్నారు

### "అసెంబ్లీ వద్ద ఘటన ఆషామాషీగా జరిగింది కాదు

- ఒక తల్లిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం అత్యంత బాధాకరం
- సభాపతిపై వ్యాఖ్యలు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ
- నిబంధనల ప్రకారం శాసనమండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి
- ఘటనపై భారాస అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- తెలంగాణ సంస్కృతి, సంస్కారం, మహిళల పట్ల గౌరవానికి సంబంధించిన సమస్య



హైదరాబాద్: భారాస నాయకత్వం ఫాంహౌస్ భావజాలాన్ని సభ్యులతో అమలు చేయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. అనుచిత వ్యాఖ్యలు చేసినందున తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై నిబంధనల ప్రకారం శాసనమండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని, ఘటనపై భారాస అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని శాసనసభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మిగతా 2 లో



2లో

## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్
- బీఆర్ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే కుట్రలు చేస్తున్నారని మండిపాటు

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలదే కీచకపర్వం.. వీడియో విడుదల చేసిన మంత్రి సీతక్క



2లో

- ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల మధ్యలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే వచ్చారు
- కోవా లక్ష్మీ, సబితా ఇంద్రారెడ్డిపై ఆ పార్టీ ఎమ్మెల్యేలే అనుచితంగా వ్యవహరించారు
- నవీన్ రెడ్డి నెట్టుకుంటూ పోయినప్పుడు ఆ మహిళా ఎమ్మెల్యేలు అయ్యో అని అరిచారు

## పోలవరాన్ని గోదాట్లో కలిపారు.. మెగా డీఎస్సీకి అడ్డుపడ్డారు

అమరావతి: కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తుంటే, ‘గొడ్డలి పార్టీ’ కుట్రలు పన్నుతోందని, జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం మాచవరంలో ‘మీ భూమి- మీ హక్కు’ సభలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర విభజన నష్టాలు, గత ప్రభుత్వ తీరు, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై కూలంకషంగా ప్రసంగించారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలనపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. “రాజకీయ కక్షతో పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను గోదాట్లో కలిపేశారు. కాంట్రాక్టర్‌ను మార్చకుండా ఉంటే 2021కే ప్రాజెక్టు పూర్తయ్యేది. ఇప్పుడు కరవు పరిస్థితుల్లో ఆ ప్రాజెక్టు రాష్ట్రాన్ని ఆదుకునేది. గత పాలనలో బయటకు రావాలంటే, మాట్లాడాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పేపర్లను ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లతో దిద్దించి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేశారు. కల్తీ మద్యం కారణంగా సుమారు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు” అని ఆయన ఆరోపించారు. వైసీపీని ‘గొడ్డలి పార్టీ’గా అభివర్ణిస్తూ చంద్రబాబు విరుచుకుపడ్డారు. “ప్రజల సమస్యలపై చర్చించమని అసెంబ్లీకి రమ్మంటే వచ్చేది లేదని మొండికేస్తున్నారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయటకు వస్తే చాలు, ఎక్కడికి వెళ్లినా హింసే. ‘రప్పా రప్పా’ అంటూ రౌడీయిజం చేస్తారు. ఫ్లెక్సీలకు పొట్టేళ్లను బలి ఇచ్చి హింసను ప్రేరేపిస్తారు. సామాజిక మాధ్యమాల్లో మా కుటుంబ సభ్యులపై అసభ్యంగా రాతలు రాయిస్తారు. ఒక రాజకీయ పార్టీగా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు?” అని ఆయన ప్రశ్నించారు. శాంతిభద్రతల విషయంలో తాను ఎప్పుడూ కఠినంగానే వ్యవహరిస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. “గతంలో నక్సల్స్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించాను. అలిపిరిలో నాపై క్లైమోర్ మైన్స్ పేల్చినా ప్రజల కోసమే పనిచేస్తున్నాను. మాటా కక్షల విషయంలో మాట వినని నా పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను అరెస్టు చేయించిన చరిత్ర నాది. సీఎంగా నేను సమర్థవంతంగా పనిచేయకపోతే రాష్ట్రానికి నష్టం జరుగుతుంది” అని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిగా పనిచేసిందని, దీనివల్లే రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చంద్రబాబు తెలిపారు. పోలవరం, అమరావతి నిర్మాణ పనులను తిరిగి చేపట్టగలిగామన్నారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును తానే ప్రారంభించానని, ఆ నీటితో ప్రజల ముఖాల్లో ఆనందం చూసినప్పుడు తనకు ఎంతో సంతృప్తి కలిగిందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ప్రయత్నిస్తే, 350 కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారని, సరైన ఆధారాలు లేవని కోర్టు కూడా వారిని మందలించిందని గుర్తుచేశారు. గొడ్డలి పార్టీ ఎన్ని కుట్రలు చేసినా బెదిరేది లేదని, ప్రజల కోసమే నిత్యం ఆలోచిస్తానని ఆయన స్పష్టం చేశారు. రూ. 240 కోట్ల వ్యయంతో కోనసీమలో గ్రిడ్ ఆధునీకరణ చేపట్టి 3 ఫేస్ కరెంటు అందిస్తున్నామని, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తూ పాలనను మెరుగుపరుస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి: జగన్

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఒక ‘కురుక్షేత్ర సంగ్రామం’ లాంటివని వైసీపీ అధినేత జగన్ అన్నారు. అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల ప్రయోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ కార్యకర్తలు గట్టిగా నిలబడాలని పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఈరోజు నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పేరిట చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వెనుక స్థానిక ఎన్నికలను తప్పించుకునే కుట్ర ఉందనే అనుమానాలు ఉన్నాయన్నారు. సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని ప్రభుత్వ వర్గాలే చెబుతున్నాయంటే, ఎన్నికలు ఏ రీతిలో సజావుగా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నంత కాలం పారదర్శక ఎన్నికలు సాధ్యం కావని... నిత్యం ఏదో ఒక డ్రామా ఆడుతూ, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. గతంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను తీసుకెళ్లిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు అదే 23 సీట్లకు పరిమితం చేసి గుణపాఠం చెప్పారని గుర్తుచేశారు. దౌర్జన్యాలు, అబద్ధాలు ఎల్లకాలం సాగవని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## గవర్నర్‌ను కలిసిన కేటీఆర్..
## కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..
## ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. “ప్రజలేమో ‘మా సమస్యలపై మాట్లాడండి’ అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం ‘సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి’ అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు” అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.

## ఏపీ పర్యాటకానికి కొత్త జోష్.. 10 ప్రాంతాల్లో సీ ప్లేన్ల సందడి!

అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. రాష్ట్రంలోని కీలక పర్యాటక ప్రాంతాలను జల మార్గాల ద్వారా అనుసంధానించే సీ ప్లేన్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టేందుకు స్కైహోప్ ఏవియేషన్, మారిటైం ఎనర్జీ హెలి ఎయిర్ సర్వీసెస్ (మె హెయిర్) సంస్థలు ముందుకు రాగా, కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ వాటి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాలను గుర్తించారు. విజయవాడ (బెర్మ్ పార్క్), శ్రీశైలం, విశాఖపట్నం, తిరుపతి (రాయలచెరువు), సూర్యలంక, గండికోట, కాకినాడ, అరకు (జోలాపుట్), లంబసింగి (తాజంగి రిజర్వాయర్), పోలవరంలలో సీ ప్లేన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాటర్‌డ్రోమ్‌ల (మినీ విమానాశ్రయాలు) నిర్మాణానికి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) త్వరలో టెండర్లు పిలవనుంది. ఒక్కో వాటర్‌డ్రోమ్ నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఆపరేటర్లుగా సంస్థలు ముందుకు రావడంతో, వాటర్‌డ్రోమ్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే ఆయా సంస్థల ప్రతినిధులు ఈ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. గతేడాది విజయవాడలోని బెర్మ్ పార్కు నుంచి శ్రీశైలం వరకు నిర్వహించిన ట్రయల్ రన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా సీ ప్లేన్‌లో ప్రయాణించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రయోగం కార్యరూపం దాల్చనుంది. అయితే, అన్ని ప్రాంతాల్లో ఒకేసారి కాకుండా డిమాండ్‌ను బట్టి దశలవారీగా సేవలను ప్రారంభించనున్నారు. తొలి దశలో విజయవాడ, శ్రీశైలం, విశాఖపట్నం, లంబసింగి, సూర్యలంక, కాకినాడలో సేవలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ‘ఉడాన్’ పథకం కింద ఆర్థిక చేయూత అందించనుంది. ప్రయాణికుల నుంచి ఆదరణ పెరిగే వరకు, ఆపరేటర్లకు సంభవించే నష్టాలను భర్తీ చేసేందుకు లోటు భర్తీ నిధి (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ - వీజీఎఫ్) కింద తోడ్పాటు అందిస్తుంది. రాష్ట్రానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుండటంతో సీ ప్లేన్లకు మంచి ఆదరణ లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఇప్పటికే కేరళ, గుజరాత్‌లలో ఉడాన్ పథకం కింద సీ ప్లేన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు వాటి సరసన ఆంధ్రప్రదేశ్ కూడా చేరనుంది. ఈ వాటర్‌డ్రోమ్‌లను కేవలం సీ ప్లేన్లకే కాకుండా, ఇతర పర్యాటక బోట్ల అవసరాలకు కూడా వినియోగించుకునేలా డిజైన్ చేస్తున్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలదే కీచకపర్వం..
## వీడియో విడుదల చేసిన మంత్రి సీతక్క

హైదరాబాద్: బీఆర్ఎస్‌ఎమ్మెల్యేలు సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేలపట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించారని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. ఇందుకు సంబంధించి అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనపై వీడియోను ఆమె విడుదల చేశారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవలక్ష్మీలను వెనక నుంచి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి తోసేయడంతోపాటు.. గంగుల కమలాకర్ మహిళా ఎమ్మెల్యేలను వెనకనుంచి నెట్టుకుంటూ ముందుకు వచ్చారని తెలిపారు. మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన మంత్రి సీతక్క.. ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల మధ్యలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే వచ్చారని... అలా చొరబడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కోవా లక్ష్మీ, సబితా ఇంద్రారెడ్డిపై ఆ పార్టీ ఎమ్మెల్యేలే అనుచితంగా వ్యవహరించారని తెలిపారు. నవీన్ రెడ్డి నెట్టుకుంటూ పోయినప్పుడు ఆ మహిళా ఎమ్మెల్యేలు అయ్యో అని అరిచారని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలను వెనక నుంచి తోసిన గంగుల కమలాకర్, సుధీర్‌రెడ్డిలది కీచకపర్వమని విమర్శించారు.

## ఎన్నారైల అండతోనే గెలిచాం.. చంద్రబాబు అరెస్ట్ సమయంలో కొండంత బలమిచ్చారు

అమరావతి: 2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడటంలో ప్రవాస తెలుగువారి (ఎన్నారై) పాత్ర మరువలేనిదని, వారి అండతోనే తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. తెలుగుజాతిని ప్రపంచ యవనికపై నంబర్ వన్ స్థానంలో నిలిపే బాధ్యతను అందరం కలిసికట్టుగా తీసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల్లో కూడా ఎన్డీయే కూటమిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నారై టీడీపీ సెంట్రల్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా, నూతనంగా ఎన్నికైన సభ్యులతో ఎన్నారై సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. గ్లోబల్ ఎన్నారై టీడీపీ అధ్యక్షుడిగా డాక్టర్ పి. గురురాజా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ.. “ప్రపంచంలో తెలుగువారు లేని దేశం లేదు. ఏ దేశానికి వెళ్లినా కనీసం 20 మంది తెలుగువాళ్లు మనకు కనిపిస్తారు. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక స్వర్గీయ ఎన్టీఆర్. ఆయన రాజకీయాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి, చదువుకున్న వారికి, మేధావులకు అవకాశాలు కల్పించారు. ఆయన ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో 50 శాతం స్థానాల్లో యువత గెలుపొందగా, ఏడుగురు ఎన్నారైలకు టీడీపీ అవకాశం కల్పించింది. వారిలో పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి కావడం మనందరికీ గర్వకారణం” అని వివరించారు.

### కష్టకాలంలో ఎన్నారైలే కొండంత బలం

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. “మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయాలని చూశారు. ఆనాడు అమరావతి ఉద్యమానికి ఎన్నారైలు అండగా నిలిచారు. వారిపై అక్రమ కేసులు పెట్టినా భయపడలేదు. చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు 50 దేశాల్లోని 200 నగరాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి తమ గళాన్ని వినిపించారు. ఆ సమయంలో ‘మనకు ఈ రాజకీయాలు అవసరమా’ అని నా భార్య బ్రహ్మణి నన్ను ప్రశ్నించింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మీరు నిర్వహించిన ‘ఐయామ్ విత్ సీబీఎన్’ కార్యక్రమం మా కుటుంబానికి కొండంత బలాన్నిచ్చింది. మళ్లీ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పాన్ని బలపరిచింది. ఎంతోమంది ఎన్నారైలు వేల డాలర్లు ఖర్చుపెట్టుకుని ఓటు వేయడానికి రాష్ట్రానికి వచ్చారు. ఉద్యోగాలకు సెలవులు పెట్టి గ్రామాల్లో తిరిగి ప్రజలను చైతన్యపరిచారు. మీ కృషితోనే ఈ రోజు ప్రజా ప్రభుత్వం ఏర్పడింది” అని లోకేశ్ భావోద్వేగంగా ప్రసంగించారు.

### ఎన్నారైలు.. అత్యంత నమ్మకమైన భారతీయులు

ఎన్నారైలు అంటే ‘మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్’ అని అభివర్ణించిన లోకేశ్, వారు మంచి ఉద్యోగాలు చేస్తున్నా నమ్ముకున్న పార్టీ కోసం, తెలుగుజాతి కోసం నిలబడ్డారని ప్రశంసించారు. “విదేశాల్లో ఉంటూ కూడా మీ పిల్లలకు అద్భుతమైన తెలుగు నేర్పిస్తున్నారు. సొంత గ్రామాలపై మమకారం, సేవాభావంతో మీరు చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మీ నిబద్ధతకు హృదయపూర్వక నమస్కారాలు” అని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా తెలుగువారికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఉత్తరాఖండ్ వరదలు, ఉక్రెయిన్ యుద్ధం, నేపాల్ సంక్షోభం సమయంలో ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చిన ఘనత చంద్రబాబుదని తెలిపారు.

### చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు.. నిరసనకు పిలుపు

చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తయిందని లోకేశ్ గుర్తుచేశారు. “దొంగ కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. మొదట రూ.3 వేల కోట్ల అవినీతి అన్నారు, తర్వాత రూ.300 కోట్లు, చివరికి రూ.3 కోట్లకు తగ్గించారు. కానీ ఒక్క రూపాయి అవినీతిని కూడా నిరూపించలేకపోయారు. ఐటీ, ఈడీ, కోర్టులు క్లీన్‌చిట్ ఇచ్చాయి. ఆయన ఏ తప్పూ చేయలేదు. ఆయన అభివృద్ధి చేసిన ప్రాంతంలోనే ఆయన్ను జైల్లో నిర్బంధించారు. ఆ 53 రోజులు మనమంతా పోరాడాం. ఆ అక్రమ నిర్బంధానికి గుర్తుగా ఈ రోజు రాత్రి అందరూ తమ ఇళ్లలో 53 కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలపాలి” అని పిలుపునిచ్చారు.

### పార్టీ బలోపేతానికి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి

ఎన్నారైలు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, తాము పనిచేస్తున్న కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా చొరవ చూపాలని లోకేశ్ కోరారు. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయని, రాష్ట్ర అభివృద్ధిలో ఎన్నారైలు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం ఎన్నారై సభ్యత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ ‘మై టీడీపీ యాప్’ ద్వారా అనుసంధానం కావాలని సూచించారు. “ఏ దేశంలో పది మంది తెలుగువారు ఉన్నా అక్కడ ఎన్నారై టీడీపీ కమిటీ ఉండాలి. రాబోయే 30 రోజుల్లో కమిటీల నియామకాన్ని పూర్తిచేయాలి. కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలి” అని దిశానిర్దేశం చేశారు.

## అది ఫాంహౌస్ భావజాలం.. సభ్యులతో అమలు చేయిస్తున్నారు

మొదటి పేజి తరువాయి

నిబంధనల ప్రకారం శాసనమండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని, ఘటనపై భారాస అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని శాసనసభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని బలపరుస్తూ ఉపముఖ్యమంత్రి సభలో మాట్లాడారు. “అసెంబ్లీ వద్ద ఘటన ఆషామాషీగా జరిగింది కాదు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందనే అనుమానాలున్నాయి. శాసనసభ సమావేశాలకు ముందు రోజు ఫాంహౌస్‌లో భారాస శాసనసభాపక్ష సమావేశం జరిగింది. అక్కడి భావజాలం ఆధారంగానే కొందరు భారాస సభ్యులు ప్రవర్తించారు. గత భారాస ప్రభుత్వ హయాంలోనే సభలోకి బ్యాడ్జీలు తీసుకురావొద్దని, ప్రదర్శనాత్మక గుర్తులున్న దుస్తులు ధరించరాదని రూల్ బుక్‌లో పొందుపరిచారు. వారు రూపొందించిన నిబంధనలను అమలు చేస్తున్న సభాపతిని పరుష పదజాలంతో దూషించడం ఎంత వరకు సమంజసం. ఇది దళిత వర్గాలకు సంబంధించిన అంశం కాదు. తెలంగాణ సంస్కృతి, సంస్కారం, మహిళల పట్ల గౌరవానికి సంబంధించిన సమస్య. ఒక తల్లిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం అత్యంత బాధాకరం. సభాపతిపై వ్యాఖ్యలు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. ఇది ఒక వ్యక్తికి జరిగిన అవమానం కాదు. మొత్తం చట్టసభకు జరిగిన అవమానం. స్పీకర్‌ను ‘దళిత స్పీకర్’గా చూడటం సరికాదు. ఆయన మొత్తం శాసనసభకే సభాపతి. భారాస పాత భూస్వామ్య, ఫ్యూడల్ మనస్తత్వాన్ని మరిచిపోలేదు. ప్రజాస్వామ్యం, తెలంగాణ ఆత్మగౌరవం, సామాజిక సమానత్వంపై దాడి చేసే శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. భారాసను శాసనసభలోనే కాదు.. ప్రతి గ్రామంలోనూ ప్రజలు దూరంగా ఉంచాలి” అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

### ఆత్మగౌరవమే మా అలంకారం: మంత్రి దామోదర్

భావప్రకటన స్వేచ్ఛ అంటే ఒకరి తల్లిని అవమానించే హక్కు కాదు.. విమర్శించే హక్కు అంటే ఒకరి కులాన్ని కించపరచడం కాదని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. “రాజకీయాల్లో విమర్శలు, అభిప్రాయ భేదాలు సహజం. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను అవమానించడం అత్యంత దిగజారుడుతనం. తప్పు జరిగినప్పుడు పశ్చాత్తాపం వ్యక్తం చేయడం, క్షమాపణ చెప్పడం కనీస సంస్కారం. ఘటన జరిగి సుమారు 30 గంటలు గడిచినా వారిలో స్పష్టమైన పశ్చాత్తాపం కనిపించకపోవడం బాధాకరం. మాకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు. ఆత్మగౌరవంతో ఇక్కడి వరకు వచ్చాం. ఆత్మగౌరవమే మా అలంకారం. అదే మా స్ఫూర్తి” అని పేర్కొన్నారు.

స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన దూషణలను ఖండిస్తూ సభ తీర్మానం..

“శాసనసభ ప్రాంగణంలోని గేట్ నంబరు-3 సమీపంలో ఈ నెల 7న భారాస ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. ఇది తెలంగాణ శాసనసభ గౌరవం, హక్కులు, సంస్థాగత సమగ్రతకు విఘాతం కల్గించే చర్య. తమ పార్టీ సభ్యుల అనుచిత ప్రవర్తనకు ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్‌రావు బాధ్యత వహించి సభ హుందాతనం పరిరక్షించేందుకు స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సభ తీర్మానిస్తోంది. అదే విధంగా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలు ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్నందున తీర్మానం ప్రతిని, సభ ముందు ఉంచిన ఘటనకు సంబంధించిన ఆధారాలతో శాసనమండలి ఛైర్మన్‌కు పంపించాలని సభ తీర్మానిస్తోంది. ఈ విషయంలో నిబంధనలకు అనుగుణంగా శాసనమండలి ఛైర్మన్ తదుపరి చర్యలు తీసుకోవాలి” అని మంత్రి సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం సభ తీర్మానాన్ని ఆమోదించింది. అంతకు ముందు ఈ అంశంపై సత్తుపల్లి, పాలకుర్తి ఎమ్మెల్యేలు రాగమయి, యశస్వినిరెడ్డిలు మాట్లాడుతూ మహిళా అధికారులపై దురుసుగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చొప్పదండి, ఖైరతాబాద్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, దానం నాగేందర్ మాట్లాడారు.

## ఇరాన్‌కు అణ్వాయుధం దక్కే ఛాన్సే లేదు: ట్రంప్

ఢిల్లీ: ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని సాధించలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఆ దేశం అణ్వస్త్ర తయారీ దిశగా అడుగులు వేయకుండా తాము కఠిన చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే ఆంక్షల రూపంలో వారిని కట్టడి చేశామని ఆయన పేర్కొన్నారు. వాషింగ్టన్‌లో మంగళవారం జరిగిన ‘స్టీల్ అక్రాస్ అమెరికా’ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. “ఒక దేశం అణ్వాయుధాన్ని సాధించాలని భావించి, ఆ లక్ష్యానికి అత్యంత చేరువగా వెళ్లింది. కానీ, ఇప్పుడు ఆ అవకాశం వారికి లేదు. వారికి అణ్వాయుధం ఎప్పటికీ దక్కదు” అని ఇరాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై విధించిన ఆంక్షలు అత్యంత శక్తిమంతంగా, సమర్థవంతంగా పనిచేశాయని, ఈ స్థాయిలో విజయం లభిస్తుందని ఎవరూ ఊహించలేదని ఆయన అమెరికా సైన్యాన్ని ప్రశంసించారు. సెప్టెంబర్ 11 ఉగ్రదాడుల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ దాడుల్లో అసువులు బాసిన సుమారు 3 వేల మందిని స్మరించుకుంటూ ట్రంప్ ప్రసంగం సాగింది. ఈ సందర్భంగా వరల్డ్ ట్రేడ్ సెంటర్ సౌత్ టవర్ శిథిలాల నుంచి వెలికితీసిన 16,000 పౌండ్ల ఉక్కు దూలాన్ని ప్రదర్శించారు. ఉగ్రదాడుల సమయంలో ప్రజలను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన ఫైర్‌ఫైటర్ జెఫ్రీ పలాజో గౌరవార్థం.. కోస్ట్ గార్డ్‌కు చెందిన ఓ నూతన నౌకకు ఆయన పేరు పెట్టనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇదే కార్యక్రమంలో ‘ది మ్యాన్ ఇన్ ది రెడ్ బందానా’గా గుర్తింపు పొందిన వెల్లెస్ క్రౌథర్‌కు మరణానంతరం అమెరికా అత్యున్నత పౌర పురస్కారం ‘ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్’ను అందజేశారు. ఆయన తరఫున తల్లి అలీసన్ క్రౌథర్ ఈ గౌరవాన్ని స్వీకరించారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై
## మళ్లీ అఘాయిత్యాలు.. ఇద్దరి దారుణ హత్య

ఢిల్లీ: బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు ఆందోళనకరంగా మారుతున్న వేళ.. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు హిందువులు దారుణ హత్యకు గురయ్యారు. మృతుల్లో ఓ మహిళ కూడా ఉంది. తాజా ఘటనలతో హిందూ మైనారిటీల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నౌగావ్ జిల్లా మహాదేవ్‌పూర్‌లో 45 ఏళ్ల హిందూ స్వర్ణకారుడు అలీఫ్ చంద్ర దత్తా హత్యకు గురయ్యాడు. సోమవారం రాత్రి 8.30 గంటలకు మహాదేవ్‌పూర్ బజార్‌లోని తన నగల దుకాణం నుంచి ఇంటికి బయలుదేరాడు. రాత్రి 9 గంటల సమయంలో దులాల్‌పారా ప్రాంతంలోకి రాగానే కొందరు దుండగులు అతడిని అడ్డుకున్నారు. పదునైన ఆయుధంతో దాడి చేశారు. అనంతరం అతడి వద్ద ఉన్న బంగారం, 7 లక్షల బంగ్లాదేశీ టాకాలను దోచుకుని పారిపోయారు. తీవ్రంగా గాయపడిన దత్తాను కుటుంబ సభ్యులు, స్థానికులు రాజ్‌షాహీ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దత్తా మృతి చెందారు. ఇది కేవలం దోపిడీ ఘటననా? మరేదైనా కక్ష ఉందా? అన్నది ఇంకా తేలలేదని మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ ఓసీ ఒమర్ ఫరూక్ తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందన్నారు. కాక్స్‌బజార్ జిల్లా మహేశ్‌ఖాలీ ఉపజిల్లాలో 45 ఏళ్ల హిందూ మహిళ రాణి సుశీల్ హత్యకు గురైంది. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో హోనాక్ యూనియన్‌లోని తన ఇంట్లో ఆమె వంట చేస్తోంది. దొంగతనం కోసం ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించాడు. అతడిని గమనించిన రాణి కేకలు వేయడంతో ఆమె ముఖాన్ని పట్టుకుని పలుమార్లు కత్తితో పొడిచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను చకారియా ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటి తర్వాత మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనలకు కొన్ని రోజుల ముందే రంగ్‌పూర్‌లో రిటైర్డ్ హిందూ ఉపాధ్యాయుడు గణపతి చక్రవర్తి, ఆయన కుటుంబంలోని మరో ముగ్గురు హత్యకు గురయ్యారు. బంగ్లాదేశ్‌లో హిందువులతో పాటు ఇతర మైనారిటీలపై దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో తాజా హత్యలు మరింత కలకలం రేపుతున్నాయి.

## తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల
## తేదీలు ఖరారు.. బుక్‌లెట్ విడుదల

తిరుపతి: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఖరారు చేసింది. 2026 సంవత్సరానికి గాను సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఇప్పటి నుంచే ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబరు 15న సీఎం చంద్రబాబు స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పాలకమండలి సభ్యులు బుధవారం తిరుమలలో ఆవిష్కరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశం సందర్భంగా ఈ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో జరిగే వాహన సేవలు, ఇతర ముఖ్య కార్యక్రమాల వివరాలను భక్తులకు సులభంగా తెలియజేసేందుకు దీనిని రూపొందించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోందని స్పష్టం చేశారు. ఉత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా కూడా బ్రహ్మోత్సవాల వివరాలను పంచుకున్నారు. టీటీడీ ప్రకటనతో శ్రీవారి భక్తుల్లో బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది.

## ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం
## కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

హైదరాబాద్: ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. “ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు” అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

## వచ్చే మార్చి నాటికి భూ సమస్యలు పరిష్కరిస్తాం

మాచవరం: వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పరిధి మాచవరంలో ‘మీ భూమి- మీ హక్కు’ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. గతంలో రెవెన్యూశాఖలో డబ్బులు ఇవ్వకపోతే పని జరగదు అనే అపవాదు ఉంది. ఆ అపవాదును మార్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అన్ని సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. గత ప్రభుత్వంలో నేరాలు ఘోరాలు చేశారు. భూములకు భద్రత ఇవ్వడమే కూటమి ప్రభుత్వం అజెండా. పటిష్టంగా రీసర్వే చేసి.. అత్యుత్తమ టెక్నాలజీతో పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చే పట్టాదారు పాస్‌పుస్తకాలు ఎవరూ మార్చలేరు. ఇప్పటివరకు 36 లక్షల మందికి పాస్ బుక్‌లు ఇచ్చాం... వచ్చే మార్చి లోపు 56 లక్షల మందికి అందజేస్తాం. పాలన అంటే సచివాలయంలో ఉండటం కాదు. ప్రజల వద్దకు వచ్చి కష్టసుఖాలు తెలుసుకొని పాలసీలు తెచ్చి న్యాయం చేయాలి. ఓటు వేసి గెలిపించిన ప్రజలతో మాట్లాడేందుకే నా పర్యటనలు. పేదల సేవలో పునీతమయ్యేందుకు సూపర్ సిక్స్ సహా సంక్షేమ పథకాలు. ప్రజలంతా గౌరవప్రదంగా జీవించే వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది. పీ4 పథకం తెచ్చి పేదలను ఆదుకునే కార్యక్రమం చేపట్టాం. పిల్లలే సంపద.. పిల్లలు లేకపోతే యంత్రాలకు సేవ చేయాల్సి వస్తుంది.

## మళ్లీ అదే సెంటిమెంట్‌తో...
## జగన్ పాదయాత్ర 2.0కు ముహూర్తం ఖరారు



అమరావతి: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని స్పష్టత ఇచ్చారు. నేడు బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో జగన్ ఈ కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారం కోసం జగన్ ఇదే ఫార్ములాను అనుసరించిన విషయం తెలిసిందే. 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో ‘ప్రజా సంకల్ప యాత్ర’ పేరుతో ఆయన తన తొలి పాదయాత్రను ప్రారంభించారు. ఆ యాత్ర 341 రోజుల పాటు ఏకధాటిగా సాగి, 3,648 కిలోమీటర్ల దూరం కొనసాగింది. 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో యాత్ర ముగిసింది. ఈ యాత్రలో భాగంగానే ఆయన ‘నవరత్నాలు’ పథకాలను ప్రకటించారు. ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందన, యాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా రూపొందించిన ఈ హామీలు 2019 ఎన్నికల్లో వైసీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించాయి. మళ్లీ అదే సెంటిమెంట్‌తో 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జగన్ ఈ రెండో పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2027లో యాత్ర ప్రారంభించి, ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు ప్రజల మధ్యే ఉండాలని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు. త్వరలోనే ఈ పాదయాత్రకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, రూట్‌మ్యాప్‌పై స్పష్టత రానుంది. మొత్తం మీద 2029 ఎన్నికల సమరానికి జగన్ ఇప్పటినుంచే ‘పాదయాత్ర 2.ఓ’తో సిద్ధమవుతున్న సంకేతాలు పంపారు.

# బాలల హక్కుల పరిరక్షణపై కమిషన్ సభ్యురాలి పర్యటన

### 10, 11 తేదీల్లో వైఎస్ఆర్ కడప జిల్లాలో పలు సంస్థల తనిఖీ



కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 9: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శ్రీమతి కె.జి. పద్మలత సెప్టెంబర్ 10, 11 తేదీల్లో వైఎస్ఆర్ కడప జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో బాలల హక్కుల చట్టాల అమలు, సంక్షేమ పథకాల తీరును పరిశీలించేందుకు ఆమె ఈ పర్యటన చేపట్టనున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి శ్రీమతి పి. రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 10న కడపలోని అంగన్‌వాడీ కేంద్రం, సెంట్రల్ జైలు, మహిళా జైలు, దత్తత సంస్థ, కడప ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక ఆరోగ్య ఆసుపత్రి, ఏకీకృత సహాయ కేంద్రం, చిన్నపిల్లల వార్డులను కమిషన్ సభ్యురాలు సందర్శించి పరిశీలిస్తారు. అనంతరం ప్రభుత్వ బాలుర వసతి గృహం, మహిళా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తారు. సెప్టెంబర్ 11న ఖాజీపేటలోని స్మార్ట్ కిచెన్, ఏపీ మోడల్ స్కూల్, బద్వేలు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శిస్తారు. అక్కడ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. అనంతరం ప్రొద్దుటూరులో గ్రామీణ, పట్టణ ప్రాజెక్టులకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో బాలల రక్షణలో వారి పాత్రపై సమావేశమై ముఖాముఖి చర్చిస్తారు. కమిషన్ సభ్యురాలి పర్యటనలో ఎలాంటి సమన్వయ లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం సంబంధిత అధికారులను ఆదేశించింది. కేటాయించిన విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# దసరా మహోత్సవాల ఏర్పాట్లపై ప్రాథమిక సమావేశం



శ్రీశైలం, మహి న్యూస్, సెప్టెంబర్ 9 :: అక్టోబరు 11 నుండి అక్టోబరు 20 వరకు దసరా మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ మహోత్సవ నిర్వహణకు సంబంధించి చేయాల్సిన ఆయా ఏర్పాట్లను గురించి చర్చించేందుకు ఈ రోజు (09.09.2026) కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, అధ్యాపక, వేదపండితులు, శాఖాధిపతులు, ఆయా విభాగాల పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ అధికారులు తదితర సిబ్బంది పాల్గొనడం జరిగింది. ఈ సమావేశములో ఉత్సవాలలో శ్రీస్వామిఅమ్మవార్లకు జరిపించాల్సిన ఆయా కైంకర్యాలు, శ్రీస్వామిఅమ్మవార్లకు వాహనసేవలు, అమ్మవారి ఉత్సవమూర్తికి నవదుర్గ అలంకరణలు, విజయదశమిరోజున నిజరూపాలంకరణ, శమీపూజ, తెప్పోత్సవం, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, దర్శనం ఏర్పాట్లు, భక్తులకు అన్నప్రసాదవితరణ, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు మొదలైన అంశాలు ప్రాథమికంగా చర్చించబడ్డాయి. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోవు ధర్మకర్మలమండలి సమావేశంలో ఉత్సవ నిర్వహణ గురించి కూలంకషంగా చర్చించడం జరుగుతుందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ అన్ని విభాగాలు కూడా పరస్పర సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టడంలో అన్ని విభాగాలు కూడా ప్రత్యేక శ్రద్ధకనబర్చాలన్నారు. ఉత్సవరోజులలో శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరిపించాలని వైదిక సిబ్బందికి సూచించారు. అదేవిధంగా వైదిక కార్యక్రమాల నిర్వహణలో సమయపాలన ఖచ్చితంగా పాటించాలని కూడా ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని పరిపాలనావిభాగాన్ని ఆదేశించారు. భక్తులు ఆయా ఉత్సవ విశేషాలను వీక్షించేందుకు వీలుగా ఎల్.ఈ.డి స్క్రీన్లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా ఉత్సవాల సందర్భంగా తగిన విధంగా విద్యుద్దీపాలంకరణ చేయాలని ఎలక్ట్రికల్ విభాగాన్ని ఆదేశించారు. అలాగే సంప్రదాయపద్ధతిలో ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేయాలని ఉద్యానవన విభాగాన్ని ఆదేశించారు. రద్దీరోజులలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మరియు వాహనాల పార్కింగు సంబంధించి తగు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని భద్రతావిభాగాన్ని ఆదేశించారు. ఈ విషయములో స్థానిక పోలీస్ శాఖ వారి సహాయ సహకారాలను పొందాలని కూడా సూచించారు. శ్రీ స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవ సమయములో ఆయా వీధులలో వాహనాలు,ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు అడ్డు రాకుండా తగు నియంత్రణ చర్యలు చేపట్టాలని భద్రతా విభాగాన్ని ఆదేశించారు. ఉత్సవాలలో భక్తులు రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందని చెబుతూ, పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. ముఖ్యంగా ఎటువంటి ఆలస్యం లేకుండా ప్రజాశౌచాలయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేందుకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని కూడా కార్యనిర్వహణాధికారి వారు ఆదేశించడం జరిగింది. భక్తుల రద్దీకనుగుణంగా మధ్యాహ్నవేళలో అన్నప్రసాదాల వితరణకు (అన్నదానానికి), రాత్రివేళలో అల్పాహారానికి తగు ఏర్పాట్లు చేయాలని అన్నప్రసాదవితరణ విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా క్యూకాంప్లెక్స్ లో దర్శనాలకు వేచివుండే భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారాలను అందజేస్తుండాలని అన్నప్రసాదవితరణ మరియు క్యూకాంప్లెక్స్ విభాగాలను ఆదేశించారు.ఆలయ ప్రాంగణములో కూడా మంచినీటి సరఫరా ఉండాలన్నారు. ఉత్సవాలలో ఆయా ఉత్సవాల విశేషాలు భక్తులకు తెలిసేవిధంగా ఆయా ప్రదేశాలలో తగినన్ని సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ మరియు శ్రీశైలప్రభ విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా ప్రసార మాధ్యమాలలో తగు ప్రచారాన్ని కూడా కల్పించాలన్నారు. ఉత్సవాల విశేషాలను భక్తులకు తెలిసేవిధంగా ముందుగానే తగు ప్రచారం కల్పించాలన్నారు. సామాజిక మాధ్యమాలలో కూడా ఉత్సవాల సంబంధి విశేషాలను భక్తులకు తెలియజేస్తుండాలని ప్రచారవిభాగాన్ని ఆదేశించారు. ఉత్సవాల సమయంలో నిత్యకళావేదికపై ప్రవచనాలు, హరికథ, వాయిద్యసంగీతం, సంప్రదాయ నృత్యం, మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ప్రజాసంబంధాల అధికారిని ఆదేశించారు. అదేవిధంగా శ్రీస్వామిఅమ్మవార్ల గ్రామోత్సవంలో నాదస్వరంతోపాటు కోలాటం, చెక్కభజన, డోలువాయిద్యాలు మొదలైన జానపద కళారూపాల ప్రదర్శనను కూడా ఏర్పాటు చేయాలని కూడా ప్రజాసంబంధాల విభాగాన్ని ఆదేశించారు.



# 100% ఇంటింటి చెత్త సేకరణే లక్ష్యం

### ఈ-ఆటోలతో చెత్త సేకరణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి

### పిన్ పాయింట్ కార్యక్రమాన్ని పక్కాగా రూపొందించుకోవాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, సెప్టెంబర్ 09: (మహి న్యూస్): నగరంలోని 137 సచివాలయాల పరిధిలో 100 శాతం ఇంటింటి చెత్త సేకరణే లక్ష్యంగా కొత్తగా అందుబాటులోకి వచ్చిన విద్యుత్ ఆటోలను సమర్థవంతంగా వినియోగించుకునేలా పిన్ పాయింట్ కార్యక్రమాన్ని పక్కాగా రూపొందించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పారిశుద్ధ్య పర్యవేక్షక యంత్రాంగాన్ని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఉద్యోగుల కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో విద్యుత్ ఆటోలు కేటాయించిన పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విద్యుత్ ఆటోలకు కేటాయించిన సూక్ష్మ ప్రాంతాల పరిధిలో ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్తను సేకరించేలా సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి వాహనం తనకు కేటాయించిన ప్రాంతంలో పూర్తిస్థాయిలో తిరిగేలా పిన్ పాయింట్ కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని సూచించారు. విద్యుత్ ఆటో డ్రైవర్ సెలవు కారణంగా విధులకు గైర్హాజరైనా, వాహనం మరమ్మతులకు గురైనా చెత్త సేకరణకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. వాహనాల వినియోగం, రోజువారీ చెత్త సేకరణ, కేటాయించిన సూక్ష్మ ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. నగరంలో 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించే విధంగా సచివాలయ కార్యదర్శులు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యుత్ ఆటోల ద్వారా చెత్త సేకరణ వ్యవస్థను మరింత పటిష్టం చేసి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు రమేష్ బాబు, వాహనాల ఇన్‌చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



# కడపను దక్షిణ భారతదేశంలో ప్రధాన పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దుతాం..!

### 'ఇన్వెస్ట్ కడప' సెంటర్ ను ప్రారంభించిన కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### పెట్టుబడిదారులకు భూమి నుంచి అనుమతుల వరకు సంపూర్ణ చేయూత

### ఒకే వేదికపై అన్ని సేవలను అందించేలా పోర్టల్ అందుబాటులోకి



కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 9 : వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న కడపను పారిశ్రామిక, వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్ది, రానున్న రోజుల్లో దక్షిణ భారతదేశంలోనే ప్రధాన పెట్టుబడి కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా 'ఇన్వెస్ట్ కడప'ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటైన 'ఇన్వెస్ట్ కడప' కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, పలువురు పారిశ్రామికవేత్తలు, నైపుణ్య నిపుణులు, పెట్టుబడిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని పెట్టుబడి అవకాశాలు, వనరులు, సామర్థ్యాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు.. పెట్టుబడిదారులు తమ ఆలోచనతో కడపకు వచ్చిన రోజు నుంచి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు భూమి, వనరులు, అనుమతులు, వివిధ శాఖల సమన్వయం వంటి ప్రతి అంశంలో సంపూర్ణ చేయూత అందించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమన్నారు.








### పెట్టుబడి ఆలోచన నుంచి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు చేయూత...

ఒక పెట్టుబడిదారుడు తన ఆలోచనతో 'ఇన్వెస్ట్ కడప'కు వచ్చినప్పుడు.. జిల్లాలో పెట్టుబడులకు అనువైన ప్రాంతాలు, పారిశ్రామిక భూముల లభ్యత, వనరులు, నీటి సౌకర్యం, విద్యుత్, రహదారి అనుసంధానం తదితర వివరాలను అందిస్తామని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే విధానం నుంచి ఆమోదం పొందే వరకు మార్గదర్శకత్వం అందించడంతో పాటు, భూమి కేటాయింపు అనంతరం అవసరమైన అనుమతులన్నింటినీ పొందేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని చెప్పారు. పెట్టుబడిదారులు వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే కేంద్రం ద్వారా అన్ని సేవలను అందించడమే 'ఇన్వెస్ట్ కడప' ప్రత్యేకత అని తెలిపారు. సంక్లిష్టమైన ప్రాజెక్టులకు వివిధ శాఖల సమన్వయం అవసరమైనప్పుడు ఆ సమన్వయ బాధ్యతను కూడా ఈ కేంద్రం తీసుకుంటుందని చెప్పారు.

### బయటి రాష్ట్రాల పెట్టుబడిదారులకు ప్రత్యేక సహకారం..

ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే పెట్టుబడిదారులకు కడపలో అడుగుపెట్టిన మొదటి రోజు నుంచే చేయూత అందిస్తామని కలెక్టర్ తెలిపారు. వారికి అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించడం, భూములను సందర్శింపజేయడం, సాంకేతిక సందేహాలను నివృత్తి చేయడం, వనరులపై సమాచారం అందించడం, సంబంధిత శాఖలతో సమన్వయం చేయడం వంటి సేవలను అందిస్తామని చెప్పారు.

### పరిశ్రమలకే పరిమితం కాదు...




'ఇన్వెస్ట్ కడప' కేవలం పరిశ్రమల కోసం మాత్రమే కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యుత్, సౌర, పవన విద్యుత్, ఇంధనం, విద్యుత్ ప్రసారం, ఖనిజాల శుద్ధి, గనులు--ఖనిజాలు, పర్యాటకం, వాణిజ్యం, రియల్ ఎస్టేట్ తదితర రంగాల్లో పెట్టుబడులకు కూడా సహకారం అందిస్తామని తెలిపారు. ఐదు ఎకరాలకు పైబడిన భూ అభివృద్ధి, నిర్మాణ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, సంబంధిత పురపాలక సంస్థలు, మండళ్లు, ఇతర విభాగాలతో సమన్వయం చేసి పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు.

### పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య సిబ్బంది..



జిల్లాకు వచ్చే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడంపైనా దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో సమన్వయం చేసుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. తద్వారా పరిశ్రమలకు నైపుణ్య సిబ్బంది లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

### ఐదేళ్ల గణాంకాలు.. ఒక్కక్లిక్‌తో..

పెట్టుబడుల నిర్ణయాల్లో గణాంకాలు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ఆర్థిక కార్యకలాపాలు, వివిధ రంగాల అభివృద్ధి ధోరణులు, పెట్టుబడి అవకాశాలను అర్థం చేసుకునేందుకు గత ఐదేళ్లకు సంబంధించిన గణాంకాలను 'ఇన్వెస్ట్ కడప'లో అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ముఖ్యంగా మీడియా, పరిశ్రమలు, పెట్టుబడిదారులు అవసరమైన సమాచారాన్ని ఒక్క క్లిక్‌తో పొందేలా వ్యవస్థను రూపొందించామని చెప్పారు. గణాంకాలను అవసరానికి అనుగుణంగా వెలికితీసేందుకు ప్రత్యేక సహాయక సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కేంద్రం ఉదయం నుంచి రాత్రి 8--9 గంటల వరకు సేవలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

### డిజిటల్ భూ సమాచార వేదిక...

పెట్టుబడిదారుల కోసం ప్రత్యేక 'ఇన్వెస్ట్ కడప' అంతర్జాల వేదికను అభివృద్ధి చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న భూముల వివరాలను ద్విమితీయ పటాల రూపంలో పొందుపరిచామని చెప్పారు. ఏ భూఖండం ఎక్కడ ఉంది.. ఎంత భూమి అందుబాటులో ఉంది.. సమీపంలో నీటి వనరులు, విద్యుత్ అనుసంధానం, రహదారి సౌకర్యాలు ఎలా ఉన్నాయి వంటి వివరాలను ఒకే వేదికపై తెలుసుకునేలా రూపొందించామని తెలిపారు.

### స్థానిక యువత, విద్యార్థి పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం...

స్థానిక పెట్టుబడిదారులు, విద్యార్థి పారిశ్రామికవేత్తలు, యువ ఔత్సాహికులను ప్రోత్సహించడంలోనూ 'ఇన్వెస్ట్ కడప' కీలకంగా పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు. దీనికి సమాంతరంగా 'స్టార్టప్ కడప'ను కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 'స్టార్టప్ కడప' ద్వారా యువతలోని నూతన ఆలోచనలను ప్రోత్సహించడం, ఔత్సాహికులను నిపుణులైన మార్గదర్శకులతో అనుసంధానం చేయడం, దేశ, ప్రపంచ స్థాయిలోని అవకాశాలను పరిచయం చేయడం, అవసరమైన చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. 'ఇన్వెస్ట్ కడప', 'స్టార్టప్ కడప' రెండూ సమన్వయంతో పనిచేస్తాయని చెప్పారు.

### ఆకాంక్షి జిల్లా అభివృద్ధిలోనూ జాతీయ స్థాయిలో ముందంజ..

ఆకాంక్షి జిల్లా అభివృద్ధిలో నీతీ ఆయోగ్ నిర్దేశించిన ప్రమాణాల్లో 80.6 శాతం లక్ష్యాలను అధిగమించి జాతీయ స్థాయిలో ముందంజలో నిలవడం జిల్లాకు గొప్ప విజయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విజయం జిల్లా యంత్రాంగం ఒక్కరి కృషితో సాధ్యమైనది కాదని, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు, పారిశ్రామికవేత్తలు, మీడియా తదితరుల సమష్టి భాగస్వామ్యంతో సాధ్యమైందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం అభినందనీయమని, జాతీయ స్థాయిలో సాధించిన ఈ పురోగతి భవిష్యత్ అభివృద్ధికి ఒక ముఖ్యమైన దిశానిర్దేశంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు.

### అభివృద్ధి దిశగా సమష్టి కృషి...

గత మూడు నెలలుగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి 'ఇన్వెస్ట్ కడప'ను అందుబాటులోకి తీసుకొచ్చారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడం, పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవలు అందించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడం ద్వారా కడప అభివృద్ధికి కొత్త దిశను చూపించడమే ఈ కేంద్రం లక్ష్యమన్నారు. పెట్టుబడిదారులకు అవసరమైన చేయూత, సమాచారాన్ని ఒకే వేదికపై అందించడం ద్వారా కడపను పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, వ్యాపారవేత్తలు, ఇన్వెస్టర్లు, ఎంటర్‌ప్రెన్యూర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సత్వర, పారదర్శక రెవెన్యూ సేవలు అందించాలి



నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబరు 09 :- ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత సత్వరంగా, పారదర్శకంగా అందించడంతో పాటు భూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌తో కలిసి జిల్లా రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 22ఏ నిషేధిత భూముల జాబితా, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, రీ-సర్వే, రెవెన్యూ-1 సేవలు, హౌసింగ్ ఫర్ ఆల్, భూసేకరణ, పిజిఆర్ఎస్, ఐవిఆర్ఎస్, ఓఆర్‌సిఎంఎస్ తదితర అంశాలపై పురోగతిని సమీక్షించారు.

### ఇళ్ల స్థలాల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఇళ్ల స్థలాల కోసం ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మొత్తం 17,574 దరఖాస్తులు అందగా, జాయింట్ కలెక్టర్ లాగిన్ ప్రకారం 5,355 దరఖాస్తులు అర్హత పొందగా, 7,627 అనర్హత పొందాయని... మరో 4,592 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో 327 గ్రామాల్లో 589 లేఅవుట్లను ఏర్పాటు చేసి మొత్తం 81,588 ప్లాట్లను 4,830.365 ఎకరాల్లో అభివృద్ధి చేయగా ఇందులో 4,548 ఎకరాల ప్రభుత్వ భూమిని వినియోగించగా, 282.30 ఎకరాల ప్రైవేట్ భూమిని సేకరించేందుకు రూ.37.60 కోట్లు ఖర్చు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కొత్త మార్గదర్శకాల మేరకు ఇళ్ల స్థలాల కేటాయింపు జనవరి 2025 ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాత విధానంలో కేటాయించిన 1.5 సెంట్లు, 1 సెంటు స్థలాల్లోనే ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉంటే వాటినే కొనసాగించాలని, కొత్త విధానం ప్రకారం ఎక్కువ స్థలం కోరుకునే లబ్ధిదారుల కోసం ఖాళీగా ఉన్న ప్లాట్లలో పక్కపక్కనే ఉన్న రెండు ప్లాట్లను గుర్తించి తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

### ప్రభుత్వ భూముల పూర్తి వివరాలు సిద్ధంగా ఉండాలి

ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూముల పూర్తి వివరాలు రెవెన్యూ అధికారుల వద్ద ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ భూములు, వాగులు, వంకలు, కొండలు, అబ్జెక్షనబుల్, అన్‌అబ్జెక్షనబుల్ పోరంబోకు భూములతో పాటు ఖాళీగా ఉన్న భూములు, ఆక్రమణలు, కోర్టు వివాదాల్లో ఉన్న భూముల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. యానిమల్ కాంప్లెక్స్, వెల్‌నెస్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు తదితర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు అవసరమైన భూములను ముందుగానే గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ ఏర్పాటుకు అవసరమైన 5 నుంచి 7 ఎకరాల భూమిని గుర్తించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి 15 రోజుల్లో ప్రతిపాదనలు పంపాలని పాణ్యం తాసిల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. సేకరించిన భూముల సమాచారాన్ని ఎన్ఐసీ పోర్టల్‌లో అందుబాటులో ఉంచడం ద్వారా పరిశ్రమలు, వివిధ ప్రాజెక్టుల స్థాపనకు అనువైన భూముల వివరాలు పారిశ్రామికవేత్తలు, సంస్థలకు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

### భూ సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనం పెంచాలి - జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్

జిల్లాలో ప్రతి వారం పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీలలో 10 నుంచి 20 వరకు డాటెడ్ ల్యాండ్స్, 22 ఏ భూములకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటున్నాయని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో తహసీల్దార్లు, ఆర్డీఓలు మరింత జవాబుదారీతనంతో వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలోనే సమస్యలను పూర్తిగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఆరు నెలలకు మించి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను గుర్తించి, అవసరమైన స్థాయిలో క్లియరెన్స్ పొందాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల ఫైళ్ల పురోగతిని సమీక్షించి, ప్రజల సమస్యలు అనవసరంగా జాప్యం కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. డాటెడ్ ల్యాండ్స్‌కు సంబంధించిన సమస్యలను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని నిర్ధారించుకోవాలని స్పష్టం చేశారు. గ్రామం, సర్వే నంబర్ ఆధారంగా భూమి సరిహద్దులు, స్వభావం, ఆక్రమణలు, నీటి వనరులు తదితర అంశాలను ముందుగానే పరిశీలించేందుకు అందుబాటులో ఉన్న డిజిటల్ వనరులను అధికారులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. భూమికి సంబంధించిన ఎన్‌ఏడి, ఏలియానేషన్ , ఇతర ప్రతిపాదనలు వచ్చినప్పుడు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లే ముందే సంబంధిత భూమి పరిస్థితిని పరిశీలించడం ద్వారా సమయం ఆదా అవుతుందని తెలిపారు.

### 'గుడ్ ప్రాక్టీసెస్'గా ఉత్తమ పరిష్కార విధానాల నమోదు

తహసీల్దార్లు, మండల సర్వేయర్లు తమ స్థాయిలో పరిష్కారం కాని కనీసం మూడు ప్రధాన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కార మార్గాలతో నివేదిక సమర్పించాలని జేసీ ఆదేశించారు. రెవెన్యూ శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించిన ఉత్తమ విధానాలను 'గుడ్ ప్రాక్టీసెస్'గా నమోదు చేసి ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేయాలని సూచించారు. ప్రజలు ఒకే సమస్యపై పదేపదే పిజిఆర్ఎస్‌కు వచ్చే పరిస్థితి లేకుండా మండల, డివిజన్ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో డిఆర్ఓ రామునాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియాంక, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీరామ్, ఆర్డీఓలు, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



## శ్రీ మొగిలీశ్వర స్వామి దేవస్థానం నందు హుండీ లెక్కింపు ద్వారా110 రోజులకు ఆదాయము 5,67,157/- రూపాయలు



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం సెప్టెంబర్ 9.: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామంలో వెలసిన శ్రీ స్వయంభు మొగిలీశ్వర స్వామి దేవస్థానం నందు హుండీలు లెక్కింపు కార్యక్రమం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎమ్ .బి విజయకుమార్ ఆధ్వర్యంలో, చిత్తూరు దేవాదాయశాఖ తనిఖీదారు శ్రీ మతి ఎస్ . శ్వేత మరియు కార్యనిర్వహణాధికారి ఏ .మునిరాజ పర్యవేక్షణలో 110 రోజులుకు గాను ఆలయ హుండీలు ద్వారా రూ 4,74,049.00లు అన్నదానం హుండీలు ద్వారా రూ 93,108=00లు మొత్తం కలిసి 5,67,157.00 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఏ మునిరాజు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమమునకు భ్రమరాంబికా సేవాసమితి (పుంగనూరు) కార్యకర్తలు ప్రసాద్ నాయుడు, సోమశేఖర్ నాయుడు , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

## నేతన్న నేస్తం ద్వారా 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ విద్యుత్ ఖర్చుల భారం తగ్గింది..




చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 9: 1. నగరి మండలం ఏకాంబరకుపం గ్రామానికి చెందిన సంపత్ మాట్లాడుతూ... చేనేత రంగాన్ని, నేతన్నల సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న నేస్తం కార్యక్రమం ద్వారా 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రయోజనం తమకు ఎంతో ఆర్థికంగా ఉపయోగపడుతోందని వారు తెలిపారు. 2. నగరి మండలం, ఏకాంబర కుప్పం గ్రామానికి చెందిన వేణుగోపాల్ మాట్లాడుతూ... మగ్గాల నిర్వహణకు విద్యుత్ ఎంతో కీలకమని, విద్యుత్ చార్జీల కారణంగా గతంలో ప్రతి నెలా గణనీయమైన మొత్తాన్ని బిల్లుల రూపంలో చెల్లించాల్సి వచ్చేదని నేతన్నలు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతో విద్యుత్ బిల్లుల భారం గణనీయంగా తగ్గిందని, దీంతో చేనేత వృత్తిని కొనసాగించేందుకు మరింత ప్రోత్సాహం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. 3. నగరి మండలం, ఏకాంబర కుప్పం గ్రామానికి చెందిన కృష్ణమూర్తి మాట్లాడుతూ... మగ్గాలు నడపడానికి విద్యుత్ ఎంతో అవసరం. ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడం వల్ల మా కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. నేతన్నల సంక్షేమం కోసం ఇలాంటి సహాయాన్ని అందిస్తున్న ప్రభుత్వానికి మా కృతజ్ఞతలు అని లబ్ధిదారులు తెలిపారు. 4. నగిరి మండలం, చింతల పట్టెడ గ్రామానికి చెందిన వెంకటేష్ మాట్లాడుతూ... చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తమలాంటి కుటుంబాలకు విద్యుత్ ఖర్చు తగ్గడం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని, ఆదా అయిన మొత్తాన్ని కుటుంబ అవసరాలకు, చేనేత వృత్తి అభివృద్ధికి వినియోగించుకునే అవకాశం కలుగుతోందని వారు పేర్కొన్నారు. నేతన్నల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం తమకు భరోసానిస్తోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.




## చిత్తూరు జిల్లాలో ఘనంగా 9వ జాతీయ పోషణ మాసం ప్రారంభం



చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 09: చిత్తూరు జిల్లాలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలు 09-09-2026 నుండి 08-10-2026 వరకు నిర్వహించనున్న సందర్భంగా, బుధవారం జిల్లా స్థాయిలో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ 9వ జాతీయ పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్యామ సుగుణ, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శ్రీమతి నిర్మల, పోషణ్ అభియాన్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. 9వ జాతీయ పోషణ మాసంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పోషకాహారం, ఆరోగ్యం, తల్లి--శిశు సంరక్షణ, చిన్నారుల ఎదుగుదల మరియు పోషకాహార లోపం నివారణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయం ఎంతో ముఖ్యమని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా 10-09-2026న వివిధ లైన్ డిపార్ట్‌మెంట్స్ అధికారులతో పోషణ్ మాసం కార్యక్రమాల నిర్వహణ మరియు సమన్వయంపై ప్రత్యేక సమావేశం జేసీ ఛాంబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణ్ మాసం కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి, ప్రజలకు పోషకాహారం మరియు ఆరోగ్యంపై విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## నవోదయలో సువర్ణ అవకాశం

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 9: మదనపల్లి జిల్లాలో ఉన్న వలసపల్లి నందలి పి. యం జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11 తరగతుల్లో చేరడానికి 10-04-2027న జరగనున్న ప్రవేశ పరీక్షకు ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోవడానికి సెప్టెంబరు 30వ తేదీ చివరి తేదీ అని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం స్థానిక కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్ నందు గోడ పత్రికను విడుదల చేశారు సారాంశం ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2026-27 విద్యాసంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8,10 తరగతులు చదువుతూ ఉండాలని తెలియజేశారు. జిల్లాలోని అర్హులైన విద్యార్థులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అత్యుత్తమమైన ఉచిత విద్యను పొందాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు అత్యుత్తమ విద్య అందించేందుకు ఇది ఒక గొప్ప అవకాశం అని తెలియజేశారు.ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ప్రకటన రూపంలో తెలిపారు.

## దక్కిలి తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన

### - జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు



దక్కిలి, మహి న్యూస్, సెప్టెంబర్ 09: దక్కిలి మండల తహశీల్దార్ కార్యాలయాన్ని శ్రీకాళహస్తి ఆర్డీఓతో కలిసి జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రెవెన్యూ వ్యవహారాలు, పెండింగ్ ఫైళ్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించి, వాటిని నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వే కార్యక్రమం పురోగతిని సమీక్షించి, సర్వేయర్లు, వీఆర్ఓలు, ఇతర సిబ్బందితో రీ సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక, ఆచరణాత్మక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. ప్రజల అర్జీలు, ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని సూచించారు. రీసర్వే పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని శాఖల సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐలు, వీఆర్ఓలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

### భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు
### 15న శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం
### భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి టీటీడీ పెద్దపీట
### తిరుమలకు వచ్చే భక్తులకు తొలిసారిగా లైఫ్ ఇన్సూరెన్స్
### భాషా, సాంస్కృతిక అభివృద్ధికి టీటీడీ సహకారం : టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల ,సెప్టెంబర్ 9,మహి న్యూస్: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తోందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో బుధవారం ఛైర్మన్ అధ్యక్షతన టీటీడీ పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి ఛైర్మన్ మీడియాకు వెల్లడించారు.

**ముఖ్యాంశాలు**

తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నాం. అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ నెల




14వ తేదీ సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సెప్టెంబర్ 15న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తాం. సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ముఖ్యమంత్రిగారి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. అదే రోజు రాత్రి 9 గంటలకు శ్రీ స్వామివారి పెద్దశేష వాహన సేవలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. రిలయన్స్ సంస్థ టీటీడీకి విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. అదే కార్యక్రమంలో 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ క్యాలెండర్లు, డైరీలను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ 10 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతున్నాం. బ్రహ్మోత్సవాల్లో దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలతో పాటు సింగపూర్, జర్మనీ దేశాల నుంచి కళాకారులు పాల్గొననున్నారు. భక్తుల భద్రతకు 3,000 మంది పోలీసులతో పాటు 2,500 మంది టీటీడీ నిఘా, భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం. తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు 3,000 నుంచి 3,300 మంది సిబ్బందిని నియమిస్తున్నాం. ఈ ఏడాది గరుడసేవకు గతేడాదితో పోలిస్తే 15 నుంచి 20 శాతం మంది భక్తులు అదనంగా వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గరుడసేవ రోజున గతేడాది 6.13 లక్షల మందికి అన్నప్రసాదం అందించగా, ఈసారి 9.30 లక్షల మందికి అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇది గతేడాదితో పోలిస్తే 52 శాతం అదనం. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. దర్శనం, వసతి, అన్నప్రసాదం, రవాణా, భద్రత, వైద్యం, పారిశుద్ధ్యం, విద్యుత్, పుష్పాలంకరణలు తదితర అన్ని విభాగాల్లో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం, సురక్షితమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించడమే టీటీడీ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది. భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా టీటీడీ, పోలీస్, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పటిష్టమైన, సమగ్ర ఏర్పాట్లు చేపట్టింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు టీటీడీ సిద్ధంగా ఉంది.

**ఇతర అంశాలు :**

భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, తిరుమలలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అందించే బీమాను రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నాం. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తిరుమలలో సహజ మరణం సంభవించిన సందర్భంలో లైఫ్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించాం. ఈ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా ఆలయాల పరిపాలనలో టీటీడీ ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా మరణించిన భక్తుని కుటుంబానికి రూ.2 లక్షలు చెల్లిస్తారు. పదవీ విరమణ పొందిన సిపిఎస్/ఎన్పీఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఓ పి ఎస్/పెన్షనర్లు తరహాలో ఈ హెచ్ ఎఫ్ సౌకర్యం కల్పిస్తూ నిర్ణయం




తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్లు, హోటళ్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలను విభాగాలుగా విభజించి వాటర్ హైడ్రాలసిస్ ప్రక్రియ ద్వారా బయోగ్యాస్ తయారు చేసి టీటీడీ అన్నప్రసాద కేంద్రానికి సరఫరా చేసేందుకు ఐఓసీఎల్ సంస్థ ముందుకు వచ్చింది. ఇందుకోసం బయోగ్యాస్ ప్లాంట్ నిర్వహణను రూ.2.80 కోట్లతో మెసర్స్ జిపిఎస్ రెన్యువబుల్ కు అప్పగించేందుకు ఆమోదం తెలిపాం. శ్రీవారి పోటులో లడ్డూల తయారీని మరింత వేగవంతం చేసేందుకు 400 మంది అదనపు అవుట్‌సోర్సింగ్ వర్కర్ల పోస్టుల కోసం ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు పంపుతున్నాం. టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాలను పెంచేందుకు నిర్ణయం తీసుకున్నాం. తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అదనపు సిబ్బందికి తిరుమలకు రవాణా ఛార్జీలు చెల్లించేందుకు నిర్ణయించాం. ఇందుకోసం 3 సంవత్సరాలకు రూ.1.60 కోట్లు మంజూరు చేశాం. నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపాం. చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం చేసేందుకు రూ.17.05 కోట్లకు ఆమోదం తెలిపాం. తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమీకి కేటాయించిన టీటీడీ భవనం లైసెన్సు గడువును మరో మూడేళ్లపాటు, అంటే 02-11-2026 నుంచి 01-11-2029 వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపాం. ఈ సమావేశంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డా.ఎ.శరత్, ప్రభల గోపినాథ్, సివిఎస్వో కే వి మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చిత్తూరు సమీపంలోని పి.కొత్తకోటలో అంగన్వాడీ కేంద్రాలు, రేషన్ షాపులు, పాఠశాలలు, గురుకులాలను తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 8: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్ చిత్తూరు జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం పూతలపట్టు నియోజకవర్గంలోని కొత్తకోట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్. వెంకటరాముడు, డీఎం సివిల్ సప్లై లక్ష్మీ, డీవైఈఓ ఇందిరా, ఐసీడీఎస్ పీడీ ఎఫ్ఏసీ శ్యామ్ సుగుణ కుమారి, బీసీ/ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ భాష, డీసీఓ పద్మజ, ఐరాల సీడీపీఓ నిర్మల తదితర సంబంధిత అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఫుడ్ కమిషన్ సభ్యుడు కొత్తకోట గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలు, పాఠశాలలు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ అందుతున్న పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం, నిత్యావసర సరుకుల పంపిణీ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ





కేంద్రాల తనిఖీలో కొన్ని చిన్నపాటి లోటుపాట్లు గుర్తించామని, వాటిపై సమగ్రంగా విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కొత్తకోట జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసినట్లు తెలిపారు. పాఠశాల రికార్డులను పరిశీలించగా సుమారు 500 గుడ్లు లెక్కలో లేకపోవడం గుర్తించామని, గుడ్ల సరఫరా, వినియోగానికి సంబంధించిన రికార్డులను తేదీల వారీగా, సక్రమంగా నిర్వహించలేదని గుర్తించినట్లు చెప్పారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి మెమో జారీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అదేవిధంగా కొత్తకోటలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల నుంచి నేరుగా వారి సమస్యలపై అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. కొంతమంది విద్యార్థులు చికెన్ సరిపడా అందడం లేదని, ఉప్మాలో పురుగులు, అన్నంలో పురుగులు కనిపిస్తున్నాయని ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. సుమారు 200 మంది విద్యార్థులు ఈ అంశాలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు చేసిన ఫిర్యాదులపై సంబంధిత జిల్లా అధికారుల సమక్షంలో సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఫుడ్ కమిషన్ సభ్యుడు తెలిపారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో తన రెండు రోజుల పర్యటనలో భాగంగా మరిన్ని వసతి గృహాలు, హాస్టళ్లు, రేషన్ డిపోలు తదితర ప్రాంతాలను కూడా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పౌష్టికాహారం అందించడంలో ఎక్కడైనా నిర్లక్ష్యం లేదా అవకతవకలు గుర్తిస్తే ఫుడ్ కమిషన్ సీరియస్‌గా తీసుకుని బాధ్యులపై కఠిన చర్యలు, అవసరమైతే కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి పరిధిలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు విస్తృత పర్యటన




శ్రీకాళహస్తి, మహి న్యూస్, సెప్టెంబర్ 09: ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం ఎడగారు పంట కోతలు జోరందుకున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీకాళహస్తి ఆర్‌డీఓ భాను ప్రకాష్ రెడ్డితో కలసి బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పంట పొలాలను సందర్శించిన జాయింట్ కలెక్టర్, నేరుగా రైతులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రైతులకు అందుతుందో లేదో రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. వ్యాపారులు, దళారులు ధర తగ్గించకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హార్వెస్టింగ్, నూర్పిడి, రవాణా, ధాన్యం విక్రయ సమయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆర్‌డీఓను ఆదేశించారు. రైతుల ధాన్యం విక్రయాలు సులభతరంగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

## బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల ఘాట్‌రోడ్డులో రవాణా శాఖ-పోలీసుల సంయుక్త తనిఖీలు



తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 09: తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల ఘాట్‌రోడ్డులో భక్తులు, ప్రయాణికుల రాకపోకలు పెరిగే నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రవాణా శాఖ మరియు పోలీస్ శాఖల ఆధ్వర్యంలో తిరుమల ఘాట్ రోడ్ నందు ఈరోజు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళి మోహన్ సమన్వయం చేశారు. ఘాట్‌రోడ్డులో ప్రయాణిస్తున్న వివిధ రకాల వాహనాలను తనిఖీ చేసి, వాహనాల సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలించడం, సీట్‌బెల్ట్, హెల్మెట్ వంటి భద్రతా నిబంధనలు పాటించకపోవడం తదితర ఉల్లంఘనలను గుర్తించారు. ప్రత్యేకంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న జీపులపై 8 కేసులు నమోదు చేశారు. అలాగే సీట్‌బెల్ట్ ధరించని, హెల్మెట్ ధరించని 20 వాహనదారులపై కూడా నిబంధనల మేరకు కేసులు నమోదు చేసి, వాహనదారులకు భద్రతా సూచనలు అందించారు. ఈ సందర్భంగా డీటీఓ కొర్రపాటి మురళి మోహన్ మాట్లాడుతూ, తిరుమల ఘాట్ రోడ్డు నందు రక్షణాత్మకమైన డ్రైవింగ్ చేస్తూ , చిన్నపాటి నిర్లక్ష్యం కూడా చేయకుండా ప్రమాదాలకు దారితీసే ధోరణి విడిచి వాహనదారులు తగు జాగ్రత్త వహించాలి అని తెలియజేశారు.ముఖ్యంగా బ్రహ్మోత్సవాల సమయంలో దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు వచ్చే నేపథ్యంలో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే ప్రయాణికులను తీసుకెళ్లాలని, వేగ పరిమితులను పాటించాలని, సీట్‌బెల్ట్/హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ఘాట్‌రోడ్డులో ఓవర్‌టేకింగ్ మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తిరుమలకు వచ్చే భక్తులు కూడా వాహనదారుల సూచనలు పాటిస్తూ, సురక్షితంగా శ్రీవారి దర్శనం చేసుకుని క్షేమంగా తిరిగి వెళ్లేలా సహకరించాలని రవాణా శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక తనిఖీలలో ఎంవీఐ వెంకటరమణ నాయక్, ఏఎంవీఐ ప్రసాద్ వర్మ, ట్రాఫిక్ ఎస్ఐ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. "భక్తుల ప్రయాణం సురక్షితం -- తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రతి ప్రయాణం బాధ్యతాయుతం" అనే లక్ష్యంతో బ్రహ్మోత్సవాల వరకు రవాణా మరియు పోలీస్ శాఖల సమన్వయంతో తనిఖీలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలియజేశారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com